AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
2-7-2026 (Thursday) MAIN EDITION

## విద్యార్థిని భుజాలపై మోసుకెళ్లిన వార్డెన్



**అక్షరటుడే, ఏపీ :** ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లాలోని ఓ మారుమూల గిరిజన గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థిని భువనేశ్వరి, రెండు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. బాలిక పరిస్థితి విషమంగా మారింది. అత్యవసరంగా ఆస్పత్రికి తరలించాల్సిన పరిస్థితి నెలకొన్నా, ఆ గ్రామానికి కనీసం అంబులెన్స్ వెళ్లే రోడ్డు మార్గం లేదు. బాలిక పరిస్థితిని గమనించిన హాస్టల్ వార్డెన్ హేమ విద్యార్థినిని తన భుజాలపై ఎక్కించుకుని, కొండ మార్గంలో సుమారు 6 కిలోమీటర్ల మేర కాలినడకన ప్రయాణించి ప్రధాన రహదారికి చేరుకున్నారు. అక్కడ నుంచి ఆమెను సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## విరిగిపడిన బండరాళ్లు.. ఏడుగురు మృతి



**అక్షరటుడే, కర్ణాటక:** కర్ణాటక రాజధాని బెంగళూరు నగర శివార్లలో ఒక ప్రైవేట్ రాతి క్వారీలో జరిగిన ఘోర ప్రమాదం ఏడుగురు కార్మికుల ప్రాణాలను బలిగొంది. క్వారీలో పనులు జరుగుతుండగా, పై భాగం నుంచి భారీ బండరాయి విరిగి కార్మికులపై పడటంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతులు ఉత్తర కర్ణాటక , ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీలుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు, అధికారులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.

## ఢిల్లీలో ఉగ్రకుట్ర భగ్నం..



అక్షరటుడే, ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రకుట్రను పోలీసులు భగ్నం చేశారు. కుట్రలో భాగమైన నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురు పంజాబ్, ఒకరు ఢిల్లీకి చెందినవారు ఉన్నారు. వీరు ఢిల్లీలో పోలీస్ స్టేషన్లు, ప్రార్థనా స్థలాల వద్ద రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి రెండు విదేశీ పిస్టల్స్, 9 తూటాలు స్వాధీనం చేసుకున్నారు.

## ఆదిభట్లలో భారీ అగ్నిప్రమాదం



అక్షరటుడే, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పరిధిలోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశాయి. నాదర్‌గుల్ దగ్గర ఉన్న టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ - గౌర ఏరోస్పేస్ టెక్నాలజీ యూనిట్‌లో బుధవారం రాత్రి మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు.

## 'మావిగన్' రాజధానిపై లోకేశ్ సెటైర్లు



అక్షరటుడే, ఏపీ: వైఎస్ జగన్ 'మావిగన్' రాజధానిపై మంత్రి నారా లోకేశ్ సెటైర్లు వేశారు. గతంలో అమరావతి, ఆ తర్వాత మూడు రాజధానులు అన్న జగన్.. ఇప్పుడు మావిగన్ అంటున్నారని.. రేపు పొద్దున బెంగళూరు, తాడేపల్లి, హైదరాబాద్ కలిపి 'బెన్ తా హై' అంటారేమోనని ఎద్దేవా చేశారు. తప్పు చేసిన వారిపై 'ఎర్ర బుక్' తన పని తాను చేసుకుపోతుందన్నారు.

## మటన్‌లో ఎద్దు మాంసం

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని హబీబ్‌నగర్ -మల్లేపల్లి బడి మసీదు సమీపంలోని ఉస్మాన్ మీట్ షాప్‌పై హెచ్‌ఫాస్ట్ అధికారులు, పోలీసులు బుధవారం రాత్రి దాడులు చేశారు. మేక మాంసంలో ఎద్దు మాంసం కలిపి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దాదాపు 50 కిలోల కల్తీ మాంసాన్ని స్వాధీనం చేసుకుని, యజమానిపై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన మాంసాన్ని టెస్టింగ్‌కోసం ల్యాబ్‌కు పంపారు. ఎద్దు మాంసం కలిపిన మటన్‌ను తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. హోటళ్లు, ఫంక్షన్‌లకు సప్లై చేస్తున్నట్లు తెలిపారు.



కాంగ్రెస్, బీఆర్ఎస్ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకులాల్లో అవినీతిపై చర్చకు సిద్ధమని రెండు పార్టీల నేతలు సవాళ్లు విసురుకున్న విషయం తెలిసిందే. తెలంగాణ భవన్‌లో చర్చకు వస్తానని మంత్రి జూపల్లి ప్రకటించారు. మరోవైపు మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. సవాల్ స్వీకరించిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది.

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



## ఆరోపణలను నిరూపించాలి : పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్ :** గురుకులాల టెండర్లలో అవి నీతి జరిగినట్లు ఆరోపణలు చేస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీ ణ్ కుమార్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. మొత్తం టెండర్లు రూ.1,143 కోట్లు అయితే రూ.2 వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. తాము అవినీతి చేసినట్టు నిరూపిస్తే, దగ్గర ఆధారాలు చూపిస్తే ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తామని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సెక్రెటరీగా సోషల్ వెల్ఫేర్‌లో చేసిన అవినీతిపై విచారణ చేయాలని సీఎంకు లేఖలు రాస్తామన్నారు.

## వీబీ– జీ రామ్‌జీ పథకం ప్రారంభం



**అక్షరటుడే, ఏపీ :** గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన వీబీ జీ రామ్‌జీ పథకం దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఈ కొత్త సంక్షేమ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా ముక్కావారిపల్లె వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గురువారం ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ ఉపాధి కల్పనే ధ్యేయంగా జులై 1 నుంచి అమలులోకి వచ్చిన ఈ పథకం కూలీలకు ఎంతో మేలు చేయనుంది. ఈ పథకం ద్వారా, ఉపాధి హామీ పని దినాలను 125 రోజులకు పెంచారు. రోజువారీ వేతనాన్ని రూ. 312గా నిర్ణయించారు.

# బీఆర్ఎస్ X కాంగ్రెస్

మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ నేతలతో చర్చించేందుకు తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు బయలుదేరారు. కారులో బయలు దేరిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. హరీశ్‌రావు కారులో నుంచి దిగి నడుచుకుంటూ గన్ పార్క్ వెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ భవన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి హరీష్‌రావు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. మంత్రులు చర్చకు పిలిచి.. పోలీసులతో అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- నేతల మధ్య మాటల యుద్ధం
- తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత
- మాజీ మంత్రి హరీశ్‌రావు అరెస్ట్
- సవాల్ విసిరి తోక ముడిచారు : కేటీఆర్


### కిందపడిపోయిన హరీశ్‌రావు

పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట చోటుచేసుంది. ఈ క్రమంలో హరీశ్ రావు కిందపడిపోయారు. అనంతరం పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి, వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. జూపల్లి నిన్న తెలంగాణ భవన్‌కు వస్తా అని, ఇప్పుడు మళ్లీ గన్ పార్క్ డ్రామా ఏందన్నారు. 11 గంటలకు తెలంగాణ భవన్‌కు వస్తాను అని ఎందుకు తోక ముడిచారని ప్రశ్నించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నాయకులు అవినీతికి పాల్పడటంతోనే తమను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. డ్రగ్స్ సప్లయ్ చేస్తూ దొరికిన దొంగకు గురుకుల టెండర్లు కట్టాబెట్టారన్నారు.

### రేవంత్ రెడ్డి స్థాయికి మేమే ఎక్కువ.. కేటీఆర్

హరీశ్‌రావు అరెస్ట్ అనంతరం కేటీఆర్ తెలంగాణ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. చర్చకు రావాలని తాము సీఎం రేవంత్‌రెడ్డికి, రాహుల్ గాంధీకి సవాల్ విసిరామన్నారు. సందెట్లో సడేమియాలా మధ్యలో జూపల్లి వచ్చారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి స్థాయికి తామే ఎక్కువని, కేసీఆర్ రావాలంటే రాహుల్ గాంధీ రావాలన్నారు. ముఖ్యమంత్రికి ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే ధైర్యం లేదని కేటీఆర్ అన్నారు. గతంలో ప్రెస్‌క్లబ్‌కు రావాలని సీఎం సవాల్ విసిరారని, సవాల్‌ను స్వీకరించి వెళ్తే అప్పుడు ఆయన రాలేదని గుర్తు చేశారు. ప్రెస్‌మీట్ అనంతరం తెలంగాణ భవన్ నుంచి గన్ పార్క్ వద్దకు వెళ్తున్న కేటీఆర్‌ను పోలీసులు అడ్డుకున్నారు.

## చర్చకు కేసీఆర్ రావాలి: జూపల్లి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తాను విసిరిన సవాల్‌కు కట్టుబడి ఉన్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తనతో చర్చకు కేసీఆర్ రావాలన్నారు. తెలంగాణ భవన్‌కు కాకుండా తాను కూడా గన్ పార్క్ వస్తానని తెలిపారు. బీఆర్ఎస్ 10 ఏళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. కేటీఆర్, హరీశ్‌రావు గన్‌పార్క్‌కు రావాలని, తాను కూడా వస్తానని చెప్పారు. అక్కడే ప్రజల ముందు వాస్తవాలతో సమాధానం చెబుతాన్నారు. విడివిడిగా మాట్లాడటం ఎందుకు? ఇద్దరికీ ఒకేసారి అక్కడే జవాబిస్తాను అని పేర్కొన్నారు.

## టీఆర్ఎస్ చీఫ్ కవిత అరెస్ట్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తెలంగాణ రక్షణసేన ఆధ్వర్యంలో బోడుప్పల్‌లోని భగయత్ నగర్‌లో భూపోరాటం సాగుతోంది. ఈ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాన్ని తెలంగాణ ఉద్యమ కారులకు ఇవ్వాలని కవిత డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పోలీసులు టెంట్లు తొలగించారు. దీంతో కవిత అక్కడకు చేరుకున్నారు. తెలంగాణ ఉద్యమ కారుల రక్షణ కాలనీగా ఆ ప్రాంతానికి నామకరణం చేశారు. బొడ్రాయి ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం ఆ స్థలంలో ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. ఆందోళన చేస్తున్న ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. బలవంతంగా కారులో ఎక్కించారు. ఈ క్రమంలో ఆమె కింద పడటంతో స్వల్ప గాయాలు అయ్యాయి. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసే చేతకాక ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదని కవిత అన్నారు.

## మత్తుమందు ఇచ్చి మహిళపై లైంగిక దాడి

**అక్షరటుడే, హైదరాబాద్:** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు కంది జ్ఞానేశ్వర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. 2019లో భర్తను కోల్పోయిన గంగారం ప్రాంతానికి చెందిన ఒక మహిళతో, 2024లో జ్ఞానేశ్వర్‌కు పరిచయం ఏర్పడింది. ఒకరోజు ఆ మహిళకు ఇచ్చిన పానీయంలో మత్తుమందు కలిపిన నిందితుడు, స్పృహ కోల్పోయిన తర్వాత లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దుశ్చర్యను తన మొబైల్ ఫోన్‌లో వీడియో తీశాడు. అనంతరం బ్లాక్ మెయిల్ చేసి రూ.50 లక్షలు వసూలు చేశాడు. నిందితుడి వేధింపులు ఆగకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన చందానగర్ పోలీసులు జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## జపాన్ ప్రధానికి మోదీ ఘన స్వాగతం




**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** జపాన్ ప్రధాని సనాయే తకైచికి గురువారం రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో లాంఛనప్రాయ స్వాగతం లభించింది. ఆమె రాక సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ జపాన్ ప్రధానికి ఆత్మీయంగా స్వాగతం పలికారు. తకైచి మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె 16వ భారత్‌జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. ఆర్థిక భద్రత, పటిష్టమైన సరఫరా గొలుసులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, రక్షణ, సముద్ర భద్రత, పెట్టుబడుల రంగాలలో సహకారాన్ని మరింతగా పెంపొందించుకునే అంశాలపై ప్రధాని మోదీ ఆమెతో చర్చించారు.

## 'బిగ్ బాస్' షోలా కాంగ్రెస్ – బీఆర్ఎస్ రాజకీయం



**అక్షరటుడే, హైదరాబాద్ :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య సాగుతున్న రాజకీయ మాటల యుద్ధంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల విమర్శలు, ప్రతి విమర్శలను చూస్తుంటే ఏదో రియాలిటీ షో 'బిగ్ బాస్'ను తలపిస్తోందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. "వీరు వారం ముందే రిహార్సల్ చేసుకుని మరీ పోటాపోటీగా నటిస్తున్నారు. అబద్ధాలు చెప్పడంలో నటనకు ఆస్కార్ అవార్డు ఇస్తే, ఆ ఇద్దరూ దానికి వంద శాతం అర్హులవుతారు" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. నేతల తీరును చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.



## పా రంజిత్‌తో 'పెద్ది' బ్యూటీ..!

వరుస సినిమాలతో దూసుకుపోతున్న జాన్వీ కపూర్.. బాలీవుడ్, టాలీవుడ్ తర్వాత ఇప్పుడు కోలీవుడ్‌పై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ 'దేవర', రామ్ చరణ్ 'పెద్ది' చిత్రాలతో తెలుగులో అలరించిన ఈ బ్యూటీ.. తాజాగా తమిళంలో డిజిటల్ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయిందని వార్తలు వస్తున్నాయి. విలక్షణ దర్శకుడు పా రంజిత్‌తో చేయనున్న భారీ వెబ్ సిరీస్‌లో జాన్వీ లీడ్ రోల్ పోషించనున్నారని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది.

–అక్షరటుడే, సినిమాడెస్క్